
కథ

## హోతా పద్మినీదేవి

# అవమానం



నేను కారు డ్రైవ్ చేస్తూనే ఓరగా నా పక్క సీట్లో కూర్చున్న అమ్మని చూశాను. అమ్మ తల బాగా దించుకుని డోర్ వైపు ఒదిగిపోయి కూర్చుని ఉంది. ఆవిడ క్షణానికోసారి కొంగుతో కళ్లు ఒత్తుకోవడం చూస్తే ఆవిడ ఏడుస్తోందని అర్థమయింది. నాకు చిరాగ్గా అనిపించింది.

'ఇప్పుడేం కొంప మునిగిపోయిందని ఆ ఏడుపు. నేను, రమణి బయటకి వెళ్తే ఒంటరిగా ఉండలేనంటోందని, ఆవిడకి తన వయసువాళ్లతో కాలక్షేపమవుతుందనే కదా నేనీ నిర్ణయం తీసుకుని ఆవిడని వృద్ధాశ్రమంలో చేర్చే ఏర్పాటు చేశాను. అయినా అమ్మ ఉండబోయే శాంతి ఆశ్రమం ఏమంత దూరాబారమని? ఆవిడ నన్ను చూడాలని ఉందని ఫోన్ చేస్తే కారులో ప్రయాణం చేస్తే గంటన్నరలో ఆవిడ ముందు ఉంటాను'

నేను తల తిప్పి అమ్మ ముఖాన్ని చూశాను. ఆమె చెక్కిళ్లపై అశ్రుధారలు ఈసారి స్పష్టంగా కనబడ్డాయి. నాకు అసహనంతో కూడిన ఏహ్యతా భావం కలిగింది. అయినా మరో అరగంటలో ఈ బరువుని వదుల్చుకోబోతూ నా అసహనాన్ని ప్రదర్శించడానికి ఏదో అడ్డు వచ్చింది. సాధ్యమైనంత మృదుత్వాన్ని, లాలనని స్వరంలో అరువు తెచ్చుకుని అన్నాను.

"నేను, రమణి ఆఫీసుకి వెళ్తే నువ్వు ఒక్కర్తివీ ఇంటి దగ్గర ఉండలేవు. ఇంక పార్టీలకి, డిన్నర్‌లకి వెళ్తే ఏ అర్ధ

రాత్రికో ఇంటికి చేరుకుంటాం. నిన్ను ఈ వయస్సులో ఒంటరిగా ఆ ఫ్లాట్‌లో ఉంచడం ఇష్టం లేకనే నిన్ను ఆశ్రమంలో చేర్పించాలని నేను, రమణి నిశ్చయించు కున్నాం. అయినా నిన్ను చూడ్డానికి వారానికోసారి నేను వస్తూనే ఉంటానుగా.."

అమ్మ దుఃఖం మరింత ఉధృతమయింది. చిరాగ్గా చూశాను.

"ఏమిటమ్మా ఎందుకేడుస్తావ్? నిన్ను నేనేదో జైలుకి పంపిస్తున్నట్టు? చెప్తే అర్థం చేసుకోవేం? ఉద్యోగం కోసం నేను, రమణి బయటికి వెళ్లి తీరాలి. నాలుగు రోజులకో పార్టీ, వారానికో డిన్నరు తప్పవు. మొన్నటికి మొన్న న్యూ ఇయర్ పార్టీనాడు మేము రాత్రి రెండింటి దాకా ఇంటికి రాలేదని ఎంత కంగారు పడ్డావు? ఈ వయసులో మన భాష తెలియని ఊళ్లో ఒంటరిగా ఉండడం కష్టం. అదీగాక నన్ను మా కంపెనీ వాళ్లు మరో ఆరు నెలల్లో అమెరికా పంపి స్తారు. రమణి ఆఫీసుకి వెళ్తే నువ్వు మరీ ఒంటరిదాని వవుతావు."

అమ్మ ఏదో చెప్పబోయింది. నేను పట్టించుకోకుండా అన్నాను.

"ఆ మాటకొస్తే నా పిల్లలిద్దరినీ, ఊటీ పబ్లిక్ స్కూల్‌లో చదివించడం లేదూ? వాళ్ల భవిష్యత్తు బాగుండా లనే కదా వాళ్లని రెసిడెన్షియల్ స్కూల్‌లో ఉంచి చదివిస్తున్నది? వాళ్లు మా కోసం బెంగ పెట్టుకుని ఏడుస్తున్నారా?" క్షణం ఆగి అన్నాను. "ఆశ్రమానికి నేను వెళ్లి చూసి వచ్చాను. చాలా బాగుంటుంది. నీ వయసు ఆడవాళ్లు బోలెడుమంది ఉన్నారు. వాళ్లతో నీకు మంచి కాల క్షేపం"

"కానీ..కాని.. అక్కడ నువ్వుండ వుగా నిన్ను చూడకుండా ఎలా ఉండ గలనురా కన్నా?" అమ్మ హృద యాన్ని చీల్చుకుని వచ్చిన దుఃఖంలో నుంచి వచ్చాయా మాటలు.

నా గుండెని తాకాయా మాటలు.

"అక్కడ నువ్వుండవుగా బాబూ.."

పన్నెండేళ్ల వయసులో నేను అమ్మని వదిలి హాస్టల్‌లో ఉండడానికి ఎలా ఏడ్చానో ఇప్పుడు అమ్మ నన్ను వదిలి వృద్ధాశ్రమంలో ఉండడానికి అలాగే ఏడుస్తోంది. నాకు హఠా త్తుగా మా నాన్న గుర్తుకొచ్చాడు. పల్లె టూరిలో వ్యవసాయం చేసే నాన్న. నా చదువు కోసం పట్నంలో కాపురం పెట్టిన అమ్మ.



ooo

మాది రాజమండ్రికి ఎనభై కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న పల్లెటూరు. అక్కడ మాకు నాలుగెకరాల పొలం ఉండేది. స్వతహాగా వ్యవసాయ కుటుంబమైన మా ఇంట్లో పెద్ద చదువులు చదివిన వాడిని నేను ఒక్క డినే. దాని వెనుక మా అమ్మానాన్నల పట్టుదల, కష్టం, త్యాగం ఉన్నాయి.

మా పల్లెటూరిలో ఉన్న పంచాయతీ స్కూలులో నన్ను చదివించడం ఇష్టం లేక మా నాన్న నా చదువు కోసం రాజమండ్రిలో మా అమ్మ చేత కాపురం పెట్టించాడు. నేను, అమ్మ ఒక గది అద్దెకి తీసుకుని ఉండేవాళ్లం. పెద్దగా చదువుకోని, వ్యవ సాయం తప్ప మరేమీ చేతగాని మా నాన్న నేల తల్లినే నమ్ముకున్నాడు. ప్రతి పది రోజులకి మమ్మల్ని చూడ్డానికి వచ్చేవాడు. నన్ను పెద్ద చదు వులు చదివించడానికి మాకున్న నాలుగెకరాలపై వచ్చే ఫలసాయం సరిపోదని, చుట్టుపక్కల రైతుల పొలాలను కౌలుకి తీసుకున్నాడట నాన్న.

చిక్కిపోయి నల్లపడిపోయిన నాన్నని చూసి అమ్మ కన్నీళ్లు పెట్టుకుంటూ అన్న మాటలు బాగా గుర్తు న్నాయి నాకు.

"ఏమిటండీ బొత్తిగా ఇలా అయిపోతున్నారు? అసలు భోజనం సరిగా చేస్తున్నారా?"

"స్వంత వంట. ఏదో సులువుగా అయిపోయేది

## మీరా పరిణయం?

ప్రముఖ మాండలిన్ విద్వాంసుడు శ్రీనివాస్ సోద రుడు రాజేష్‌తో మీరా జాస్మిన్ సాన్నిహిత్యం గురించి కొంత కాలంగా వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ సంగతి గురించి ఇప్పటిదాకా మౌనంగా వుంటూ వచ్చిన మీరా ఇటీవల ఓ కార్యక్రమం సంద ర్భంగా మీడియాతో మాట్లాడుతూ సూచనప్రా యంగా రాజేష్‌తో తన దోస్తీ గురించి ప్రస్తావించింది. అతనితో పరిచయం తనకెంతో సంతోషాన్ని కలిగి స్తోందనీ, త్వరలోనే తమ పెళ్లి జరగవచ్చని అంది.

వండుకోడం. బాగానే తింటున్నానులే. అయినా నా గురించి ఆలోచించకు. మన సుధాకర్ చదువుకోడం ముఖ్యం. వాడు బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేస్తే నా కష్టమంతా మరచి పోతాను"

డబ్బు సంపాదించాలంటే ఉద్యోగం చేయాలి. మంచి ఉద్యోగం చేయాలంటే బాగా చదువుకోవాలి అనే ఆలోచనకి నా చిన్న మనసులో ఆనాడే బీజం వేశాడు నాన్న. అది మొలకెత్తి నానాటికీ పెరిగి మహావృక్షమవ్వడా నికి అమ్మ దోహదం చేసింది. నాన్న కష్టంలో పాల్పంచుకోడానికి తన వంతు సాయం చేయడానికి అమ్మ ఇంటి దగ్గర ఊరగాయలు పెట్టి అమ్మేది. నేను చదువుకుంటూంటే దగ్గరే కూర్చునేది. నేను ఒక్కొక్క క్లాసూ పాసవుతుంటే నా భవిష్యత్తుని విజయసోపానాలు నిర్మించుకున్నంత ఆనందం ఆమెలో.

ooo

నాకు అప్పుడు పన్నెండేళ్లు. నాన్నకి రోజూ సాయంకాలమయ్యేస రికి జ్వరమొస్తోందిట. ఆ పల్లెటూరిలో ఉన్న ఆర్.ఎం.పి. డాక్టరు వైద్యం చేస్తు న్నాడట. టౌనుకి వచ్చినప్పుడు పెద్ద

డాక్టరుకి చూపించుకోమని అమ్మ గొడవ చేసినా విన లేదు. నాన్న ఆరోగ్యం దెబ్బ తింటోందని ఆయన్ని కని పెట్టుకుని ఉండడం కోసం, అమ్మ నన్ను ఒక రెసిడెన్షియల్ స్కూల్‌లోని హాస్టల్‌లో చేర్చి నాన్న దగ్గరకి వెళ్లి పోదామనుకుంది.

అమ్మని వదిలి హాస్టల్‌లో ఉండడానికి బెంగ పెట్టుకున్న నన్ను మానసికంగా సంసిద్ధుడిని చేస్తూ "హాస్టల్‌లో నీకు బోలెడు మంది ఫ్రెండ్సు ఉంటారు నాన్నా! వాళ్లతో కలిసి ఆడుకోవచ్చు. చదువుకోవచ్చు" అని ఎన్నో సుద్దులు చెప్పింది.

హాస్టల్‌లో బోలెడు మంది ఫ్రెండ్సు ఉంటారనే ఆశని అమ్మని వదిలి ఉండాలనే బెంగ డామినేట్ చేస్తున్నా "సరే" అన్నాను.

అమ్మ నా బట్టలవీ పెట్టెలో సర్దింది. పచ్చళ్లు, పిండివంటలు సరేసరి. దారి పొడుగునా హాస్టల్‌లో ఎలా ఉండాలో నాకు చెబుతూనే ఉంది. పెదవి విప్పితే దుఃఖం ముంచుకొస్తుందనే భయంతో నేను ఆవిడ చెబుతున్నది వింటున్నానే తప్ప జవాబివ్వడం లేదు. హాస్టల్‌లో ఫీజు కట్టి అమ్మ నా సామాన్లని నాకు కేటాయించిన రూమ్‌లో చేర్చేసరికి నిగ్రహించుకోలేక బావురుమన్నాను.

"ఛ! తప్పు. అలా ఏడవకూడదు. చూడు నీకు ఎంతమంది ఫ్రెండ్సు ఉన్నారో!" అంది అనునయంగా నా రూమ్‌మేట్స్‌ని చూపిస్తూ.

"కానీ నువ్వు నాతో ఇక్కడ ఉండవు కదమ్మా!" అన్నాను వెక్కిళ్లు పెడుతూ.

బహుశా నా మాటలు అమ్మ గుండెని తాకాయనుకుంటాను. "నిన్ను వదిలి నేను మాత్రం ఉండగలనురా?" అని ఏడ్చింది.

నన్ను హాస్టల్‌లో ఉంచే ప్రయత్నాన్ని విరమించుకుని వెనక్కి తీసుకెళ్లింది.

○○○

మేము సంక్రాంతి సెలవులకి నాన్న దగ్గరకి వెళ్లేసరికి నాన్న అస్థిపంజరానికి బట్టలు తొడిగినట్టుగా ఉన్నాడు.

ఆ రాత్రి నాకు మెలకువ వచ్చేసరికి నాన్న నా పక్కన లేదు. గదిలో నుంచి అమ్మ ఏడుపు, అస్పష్టమైన నాన్న స్వరం వినిపించాయి. నేను చెవులు రిక్కించాను.

"నాకు కేన్సర్ బాగా ముదిరిపోయిందని చెప్పారు డాక్టర్లు. ఉన్న డబ్బంతా నా వైద్యానికే ఖర్చు పెట్టేస్తే కన్నడి చదువెలా? అయినా వైద్యం చేయించినా నేను బతుకుతానని గ్యారంటీ లేదు. మహా అయితే నా ఆయుర్దాయాన్ని ఇంకొన్నాళ్లు పొడిగించవచ్చునేమో! కన్నడిని బాగా చదివించు. వాడిమీదే నా ఆశలు, కలలు అన్నీ.."

మరో నెల రోజులకే నాన్న మరణించాడు. నాన్న చనిపోయినప్పుడు కూడా అమ్మ బెంబేలు పడలేదు. ఏడుస్తున్న నన్ను ఓదారుస్తూ అంది.

"మీ నాన్నంటే నీకు నిజంగా ఇష్టం ఉంటే ఆయనకిష్టమైన చదువుని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకు. నువ్వు పెద్ద ఉద్యోగస్తుడివి కావాలనే ఆయన ఆశని వమ్ము చేయకు."

ఆ రకంగా నాలో చదువుకోవాలనే పట్టుదలని మరింత పెంచిందావిడ.

అమ్మ నా ఎదురుగా చిరునవ్వుతో నిబ్బరంగా తిరిగినా నా పరోక్షంలో నాన్నని తలచుకుని ఏడ్చేదేమో నాకు తెలియదు. నాన్న పోయాక, పొలాన్ని అమ్మి డబ్బు బ్యాంకులో వేసింది. ఊరగాయలు పెట్టి అమ్మడం మాత్రం మానలేదు.

నాకు ఎంసెట్‌లో మంచి ర్యాంకు వచ్చి వైజాగ్‌లో ఇంజనీరింగ్ కాలేజీలో సీటు వచ్చింది. మా మకాం వైజాగ్‌కి మారింది.

ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతుండగా నా క్లాస్‌మేట్ రమణితో ప్రేమలో పడ్డాను. నేను ఆమె పట్ల ఆకర్షితుడినవ్వడానికి ఆమె అందమొక్కటే కారణం కాదు. రమణి తండ్రి కార్డియాలజిస్టుగా రెండు చేతులా సంపాదిస్తున్నాడు. కేవలం అందమొక్కటే పెళ్లికి అర్హత కాదనే స్థితికి నేనెప్పుడో ఎదిగిపోయాను. రమణి తండ్రి తలచుకుంటే నన్ను మించిన ఆస్తిపరుడిని, హోదాగల వాడిని అల్లుడిగా కొని తేగలడని నాకు తెలుసు. కేవలం రమణి పట్టుదల వలనే మా పెళ్లి జరిగింది. నేను బ్రిలియంట్ స్టూడెంట్‌ని కావడం వలన కూడా ఆయన నన్ను ఇష్టపడ్డాడని నాకు తెలుసు.

రమణి మా ఇంట్లో అడుగు పెట్టి అత్తగారి స్థానంలో అమ్మని అంగీకరించలేకపోయింది. అమ్మ పెద్దగా చదువుకోలేదు. నా అత్తమామల్లా ఇంగ్లీషు మాట్లాడలేదు. అమ్మని చూసి రమణి అందమైన కనుబొమలు అయిష్టతతో చీటికి మాటికి ముడిపడడం నేను గమనించకపోలేదు. క్రమంగా ఆవిడ ఉనికి ఆమెకి కంటకప్రాయంగా మారింది.

○○○

కంపెనీ నన్ను అమెరికా పంపిస్తోంది. నన్ను అభినందించడానికి నా కొలీగ్స్ ఇంటికి వచ్చారు. పూలదండలు, అభినందనలతో నన్ను ముంచెత్తారు. తన గది గుమ్మంలో నిలబడి నన్ను కళ్ల నిండుగా ఆనందబాష్పాలతో చూస్తున్న అమ్మని నేను గమనించకపోలేదు. నాకెందుకో అమ్మ లోపలకి వెళ్లిపోతే బాగుండుననిపించింది. ముతక చీర, మల్లు రవిక ధరించి మెడలోను, చేతులకి ఆభరణాలు లేకుండా నెరిసిన జుట్టుతో ఉన్న అమ్మని నా కొలీగ్స్‌కి ఎలా పరిచయం చేయను?

ఇంతలో నారాయణ అమ్మని చూడనే చూశాడు.

"మీకు వంట మనిషి ఉందా? ఆంధ్రా నుంచి తెచ్చావా?" ఇంగ్లీషులో అడిగేడు.

అమ్మని వంట మనిషి అని అతను అపోహపడినందుకు నాకు బాధనిపించలేదు. ఎన్నిసార్లు చెప్పినా తన

## దర్శకురాలిగా సిమ్రాన్?

అందాల తార సిమ్రాన్ పెళ్లి తర్వాత తెలుగులో నటించగా విడుదలైన 'ఒక్క మగాడు' పరాజయంతో ఆమె ఆశలన్నీ అడియాసలయ్యాయి. ఈ సినిమా విజయం సాధిస్తే మరిన్ని చాన్సులొస్తాయని భావించిన ఆమె ఇక 'జాన్ అప్పారావ్ ఫార్టీ ప్లస్' సినిమాపైనే ఆశలన్నీ వున్నాయి. అందుకనే తన రూటు మార్చాలనుకుంటోందిట. దర్శకత్వం వైపు మారాలని సిమ్రాన్ ఆలోచిస్తున్నటుట ఆమె సన్నిహితులు చెబుతున్నారు. అయితే ఇది సినిమాలకా, లేక టీవీ సీరియల్స్‌కా అనేది తేలాల్సి వుంది.



వేషభాషలని మార్చుకోని అమ్మపై కోపం వచ్చింది.

ఏం సమాధానం చెప్పాలా అని నేను ఆలోచిస్తుండగా రమణి "అవును. వంట మనిషే! ఆంధ్రా నుంచే తెచ్చుకున్నాం" అంది.

నేను, అమ్మని అక్కడ నుంచి లోపలకి వెళ్లమని ఆగ్రహం నిండిన చూపులతో ఆదేశించాను.

ఆవిడ లోపలకి వెళ్లిపోయింది. వచ్చిన వాళ్లు వెళ్లాక నేను ఆవిడపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాను.

నిన్ను, నీ వేషాన్ని చూసి నా కొలీగ్స్ నిన్ను వంట మనిషి అనుకున్నారు. కాస్త మంచి బట్టలు కొనుక్కోమని ఎన్నిసార్లు చెప్పాను.

"వాళ్లు పొరపాటు పడి ఉంటారు. అయినా ఆవిడ మా అమ్మ వంట మనిషి కాదు అని నువ్వు చెప్పే ఉంటావు. నాకు ఇంగ్లీషు అర్థం కాదు!" అదే చల్లని చిరునవ్వుతో అంది.

నేను గతుక్కుమన్నాను. "నేను ఆవిడ మా అమ్మ అని వాళ్లకెందుకు పరిచయం చెయలేకపోయాను."

"అయినా నువ్వసలు బయటికెందుకొచ్చావ్?" అసహనంగా అడిగాను.

"నువ్వు అమెరికా వెళ్తున్నందుకు వాళ్లంతా నిన్ను అభినందిస్తుంటే నాలోని అణువణువు ఉప్పొంగిపోయిందిరా. నేను చెయ్యి పట్టి అక్షరాలు దిద్దించిన నా కన్నదు ఇవాళ అమెరికా వెళ్లేంత గొప్పవాడయ్యాడంటే నాకు గర్వం కదూ?" అమ్మ ప్రశంసకి గర్వంతో ఆవిడ నా చెయ్యి పట్టి అక్షరాలు దిద్దించిన తొలి గురువు అనే పూజ్య భావంతో నా మనసు పులకరిస్తుండగా, రమణి వ్యంగ్య స్వరం వినిపించింది.

"మీరు చదివించిన పెద్ద బాలశిక్షలో మార్కులు చూసి ఇంజనీరింగ్‌లో సీటు ఇవ్వలేదు. మా ఆయనకి ఎంసెట్‌లో మంచి ర్యాంకు వచ్చింది. అదేదో మీ గొప్పతనమన్నట్టు మురిసిపోతారేమిటి?"

కోడలు తనని అలా తీసిపారేసినట్టు మాట్లాడుతుంటే అమ్మ బాధపడి ఉండదు. కానీ నేను ఆమెని వారించకపోవడం వలన బాధపడి ఉంటుంది. విహ్వలంగా చూసి తన గదిలోకి వెళ్లిపోయింది.

అమ్మ పట్ల రమణి అయిష్టత నేను అమెరికా నుంచి వచ్చేప్పటికి ఆవిడని వృద్ధాశ్రమంలో చేర్చాలనే పట్టుదలగా బలపడింది.

"మీ ఆఫీసు వాళ్లు ఇంటికి ఫోన్ చేస్తే మీ అమ్మ తగుదునమ్మా అని ఫోన్ ఎత్తి తను మీ అమ్మనని వచ్చీరాని ఇంగ్లీషులో చెప్పింది. ఆవిడ, మీ అత్తగారా? మైగాడ్! నేనింకా నమ్మలేకపోతున్నాను" అని మిసెస్ నారాయణ ఆశ్చర్యపోయింది.

నారాయణ అయితే "ఆ రోజు ఆవిడ మీ వంటమనిషి అని ఎందుకు చెప్పావ్?" అని నిలదీస్తున్నట్టడిగాడు.

నేను అమెరికా నుంచి వచ్చేప్పటికి రమణి చెప్పిన చాడీలివి.

అసహాయమైన కోపంతో ఉడికిపోయిన నేను అమ్మని ఏమీ అనకపోయినా రమణి ప్రతిపాదనకి ఆమోదముద్ర వేశాను. ఫలితమే ఇవాళ మా ప్రయాణం.

"కానీ అక్కడ నువ్వుండవుగా కన్నయ్యా!" అన్న అమ్మ మాటలతో నా మనసులోని కాఠిన్యపు పొరలు కరుగుతుండగా...

నా జేబులోని మొబైల్ ఫోన్ రింగయింది. నేను వెంటనే రిసీవ్ చేసుకున్నాను.

రమణి!

"ఎక్కడున్నారు మీరు? ఆశ్రమంలోనా?"

"దారిలో ఉన్నాం"

"ముసల్ది పేచీ పెడుతోందా?"

"ఏడుస్తోంది" అన్నాను ఇంగ్లీషులో.

"ఆమెని వెనక్కి తీసుకురండి"

"ఏం? ఆశ్చర్యంగా అడిగాను.

"మీరు మీ అమ్మని తీసుకుని ఆశ్రమానికి బయలుదేరగానే బాత్‌రూమ్‌లో కాలు జారి పడ్డాను. ఫ్రాక్చరయిందని ఎక్స్‌రేలో తేలింది. ఆరు వారాలు బెడ్ దిగడానికి వీల్లేదన్నారు డాక్టర్లు"

"నువ్వు ఎక్కడ నుంచి మాట్లాడుతున్నావ్? హాస్పిటల్ నుంచా?"

"అవును వెంటనే మీ అమ్మని ఇంటికి తీసుకుండి" ఆమె స్వరంలో సుతిమెత్తని ఆజ్ఞ.

నేను కారు బ్యాక్ చేయడానికి అనువైన ప్రదేశాన్ని వెతుకుతున్నాను.

"రమణీ హాస్పిటల్‌లో ఎందుకుంది?" ఎవరో స్వచ్ఛమైన ఇంగ్లీషులో అడిగారు.

అప్రయత్నంగానే తల తిప్పాను. అమ్మ నన్నే చూస్తూ తిరిగి అదే ప్రశ్నని రిపీట్ చేసింది.

అదిరిపడ్డాను. నా కాలు అప్రయత్నంగానే బ్రేక్‌ని నొక్కింది. కారు ఆగింది.

"అవును" అన్నాను.

"కారెందుకు బ్యాక్ చేస్తున్నావ్" మళ్లీ ఇంగ్లీషులోనే అడిగింది.

"రమణి కాలు ఫ్రాక్చరయింది. ఆరు వారాలు బెడ్ దిగకూడదని డాక్టర్లు చెప్పారుట. అందుకని..."

"నేను నీ భార్యకి సేవ చేయాలి" ఈసారి కన్నడంలో అంది అమ్మ.

షాక్‌లో ఫ్రీజయిపోయాను.

ఇంగ్లీషు..కన్నడం.. ఇంత స్వచ్ఛంగా మాట్లాడుతున్నది. అమ్మేనంటే నమ్మలేకపోతున్నాను.

"నువ్వు ఇంగ్లీషు.." ఎలా పూర్తిచేయాలో అర్థం గాక ఆగిపోయాను.

"నేర్చుకున్నాను.. నాకు ఇంగ్లీషు మాట్లాడ్డం రాదని నువ్వు నీ భార్య వెక్కిరించే వారుగా?.." క్షణం ఆగి అంది. "నేను వంట మనిషినని నీ కొలీగ్స్‌కి పరిచయం చేసింది నీ భార్య. ఇప్పుడు నా స్థానాన్ని పనిమనిషిగా దిగజార్చి నా చేత సేవలు, చేయించుకోవాలనుకుంటోంది. ఆమెకి నన్ను అత్తగారినని చెప్పుకోడం న్నామోషీ. నన్ను నీ తల్లినని పరిచయం చెయ్యడం నీకు అవమానం.. కానీ నీ లాంటి వాడు నా కొడుకు అని చెప్పుకోడం నాకే కాదు మాతృత్వానికే అవమానం" అమ్మ డోర్ తెరుచుకుని బ్యాగ్‌తో సహా దిగేసింది.

"ఎక్కడకి వెళ్తున్నావ్?" షాక్ నుంచి తేరుకుంటూ అడిగాను.

"ఈ విశాల ప్రపంచంలోకి" చెబుతూనే ముందుకి నడిచింది అమ్మ.

అమ్మ మాటలు కొరడా దెబ్బల్లా నా మనసుని తాకి నాలో నిద్రాణంగా ఉన్న మానవత్వాన్ని మేల్కొలిపాయి.

'నా ఈ శరీరం అమ్మ ఇచ్చినది. నా చదువు అమ్మ పెట్టిన భిక్ష. బహుశా నేను కురూపినైనా, అవిటివాడినైనా అమ్మ నన్ను తన కొడుకునని చెప్పుకోడానికి అవమానపడేది కాదేమో. అమ్మ చదువుకోనంత మాత్రాన నాగరికురాలు కానంత మాత్రాన ఆమె నా తల్లి అని చెప్పుకోడం అవమానంగా ఎందుకు భావించాను? ఆవిడ ముతక చీరలు కడుతోందని అసహ్యించుకున్నానే తప్ప ఒక్క మంచి చీరయినా ఎందుకు కొని పెట్టలేకపోయాను? భార్య స్థానం భార్యదే తల్లి స్థానం తల్లిదే అని తెలుసుకోలేక రమణి మాటలు విని అమ్మనెంత క్షోభ పెట్టాను?' నా మనసుని ఆవరించుకున్న మాయ పొరలు కరిగి అమ్మ విశ్వరూపాన్ని సందర్శించిన నేను గాభరాగా కారు దిగి అమ్మని అనుసరించాను అమ్మని నాతో తీసుకెళ్లడానికి. కాలు విరిగిన నా భార్యకి ఆవిడ చేత చాకిరీ చేయించడానికి కాదు, ఆవిడకి నేను సేవ చేయడానికి. అమ్మని ఆనందంగా ఉంచడం కోసం ఇప్పుడు నేనేమైనా చేస్తాను.

○

